సాక్షి
సూర్యాపేట
మంగళవారం । 15 । ఆగస్టు । 2023



బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

అనాజిపురం ఎంపీటీసీ గద్దల నాగరాజు సోమవారం మంత్రి జగదీష్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. - IIలో



దాడులు దురదృష్టకరం

మణిపూర్‌లో మైనారిటీలపై జరుగుతున్న దాడులు దురదృష్టకరమని క్రైస్తవ సంఘం, మహిళా సమాఖ్య నేతలు అన్నారు. - IIలో



సమ్మె నోటీస్ అందజేత

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. - IIలో

చోటు దక్కేనా..!

బీఆర్‌ఎస్ మొదటి జాబితాపై ఉత్కంఠ

- నెలాఖరులోగా ఫస్ట్ లిస్ట్ వెలువడే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 8 మంది పేర్లు ప్రకటిస్తారని అంచనా
- పలు నియోజకవర్గాల్లో తెరపైకి వస్తున్న కొత్త పేర్లు
- కోదాడలో సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదంటే మరో బీసీకి చాన్స్
- జూలూరి గౌరీశంకర్ పేరు పరిశీలన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ నెలలోనే అభ్యర్థుల మొదటి జాబితా ప్రకటించేందుకు అధిష్టానం సిద్ధమవుతున్న తరుణంలో.. ఆ జాబితాలో ఎవరెవరి పేర్లు ఉంటాయానే దానిపై ఊహాగానాలు జోరందుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్ ఇస్తామని సీఎం హామీ ఇచ్చినా అన్ని సర్వేల ఆధారంగానే అభ్యర్థులను ప్రకటిస్తారన్న ప్రచారం సాగుతుండటంతో ఆందోళన తప్పడం లేదు. టికెట్ ఇస్తారో లేదోనని కొందరు ఎమ్మెల్యేలు, అవకాశం వస్తుందో లేదోనని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ తెరపైకి కొత్త పేర్లు వస్తున్నాయి. మొదటి జాబితా వెలువడుతుందన్న ప్రచారంతో ఆశావహులంతా మంత్రి కేటీఆర్ అపాయింట్‌మెంట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

ఐదుగురి పేర్లు పక్కా!

ఐదు నియోజకవర్గాల్లో పోటీలో నిలిచే అభ్యర్థుల పేర్లు ఇప్పటికే పక్కాగా మొదటి జాబితాలో ప్రకటించే అవకాశం ఉంది. అందులో సూర్యాపేటలో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, హుజూర్‌నగర్‌లో శానంపూడి సైదిరెడ్డి, తుంగతుర్తిలో గాదరి కిషోర్‌కుమార్, భువనగిరిలో పైళ్ల శేఖర్‌రెడ్డి, మిర్యాలగూడలో నల్లమోతు భాస్కర్‌రావు పేర్లు మొదటి జాబితాలో ఉంటాయనే ప్రచారం సాగుతోంది. మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు జిల్లాలో జరిగిన పలు సమావేశాలకు హాజరైన సందర్భంలో.. వచ్చే ఎన్నికల్లో వారిని భారీ మెజారిటీ గెలిపించాలని పిలుపునివ్వడమే ఇందుకు ఉదాహరణ. ఇక వారితోపాటు మరికొందరి పేర్లు కూడా మొదటి జాబితాలోనే ఉండే అవకాశం ఉంది. మొత్తానికి మొదటి జాబితాలో 8 మంది పేర్లను ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

వామపక్షాలతో పొత్తుకుదిరితే..

వామపక్షాలతో పొత్తు కుదిరితే మునుగోడును సీపీఐకి కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అది తేలేవరకు బీఆర్‌ఎస్ మునుగోడు అభ్యర్థి పేరును ప్రకటించడంలో జాప్యం చేసే అవకాశం ఉంది. పొత్తులేదంటే మరోసారి సిట్టింగ్‌ల కోటాలో కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికే టికెట్ అనే ప్రచారం సాగుతోంది. అయితే ఇక్కడి నుంచి ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు దేవరకొండలోనూ కొంత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఆయనకు టికెట్ ఇవ్వొద్దంటూ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నేతలు డిండిలో ప్రత్యేకంగా సమావేశం పెట్టి మరీ తీర్మానించారు. దీంతో మొదటి జాబితాలో ప్రకటిస్తారా? లేదా? అభ్యర్థి మార్పు ఉంటుందా? అన్నది సందిగ్ధంగా ఉంది.

సాగర్‌లో ఆశావహుల జోరు

నాగార్జునసాగర్‌లో ఆశావహులు జోరు పెంచారు. సిట్టింగ్ ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి వర్గాలు మొదటి నుంచి ఎడమొహం పెడమొహంగానే ఉంటున్నాయి. ఒకరి వర్గం సమావేశాలు నిర్వహిస్తే మరొకరి వర్గం నేతలు హాజరుకాని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో టికెట్ కోసం ఆశావహులు జోరు పెంచారు. ముఖ్యంగా అక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి పెద్ద ఎత్తున సేవ కార్యక్రమాలు చేస్తున్నారు. మరోవైపు మన్నెం రంజిత్ యాదవ్ తన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి కూడా తన కేసీఆర్ ఫౌండేషన్ పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాగర్ అభ్యర్థి పేరు మొదటి జాబితాలో ఉంటుందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

మరో బీసీకి ఇవ్వాల్సి వస్తే 'జూలూరి'కి చాన్స్

కోదాడ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ టికెట్ తనకే వస్తుందన్న నమ్మకం పెట్టుకున్నారు. అయితే, సొంత పార్టీలోని అసమ్మతి ఆయనకు తలనొప్పిగా మారింది. నియోజకవర్గానికి చెందిన కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి వంటి స్థానిక నేతలు ఆయన అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు సపోర్టు చేయబోమని ప్రత్యేకంగా సమావేశాలు పెట్టి మరీ తీర్మానించారు. ఈ నేపథ్యంలో అక్కడ ఎవరికి టికెట్ ఇస్తారన్న దానిపై సందిగ్ధం నెలకొంది. ఒకవేళ సిట్టింగ్ ఎమ్మెల్యేను మార్చాల్సి వస్తే అక్కడ మరో బీసీ నేతకే చాన్స్ ఇచ్చే అవకాశం ఉంది. అందులో తెలంగాణ తొలి బీసీ కమిషన్ సభ్యుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ పేరు తెరపైకి వచ్చింది. తెలంగాణ ఉద్యమకారునిగా, సాహితీవేత్తగా ఉద్యమ సమయం నుంచి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావుకు దగ్గరగా ఉన్న ఆయనకు అవకాశం ఇస్తారనే చర్చ జోరుగా సాగుతోంది.

న్యూస్‌రీల్

గాంధీ చిత్రం ప్రదర్శన



సినిమాను వీక్షిస్తున్న విద్యార్థులు

సూర్యాపేట టౌన్: స్వాతంత్ర్యోద్యమ చరిత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సోమవారం జిల్లాలో పలు థియేటర్లలో జాతిపిత మహాత్మాగాంధీ సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సూర్యాపేటలో కలెక్టర్ ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గాంధీ సినిమాను చూసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి రోజూ సినిమా చూసిన విద్యార్థుల వివరాలు విద్యాశాఖ అధికారి తప్పకుండా అందించాలన్నారు. మొదటి రోజు 1,480 మంది వీక్షించినట్లు చెప్పారు.

ఎంవీ రంగారావుకు ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు



గ్రంథపాలకుడు ఎంవీ రంగారావును సన్మానిస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

భానుపురి (సూర్యాపేట): జాతీయ గ్రంథపాలక దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ గ్రంథపాలకుడిగా ఎంపికైన సూర్యాపేట గ్రంథపాలకుడు ఎంవీ.రంగారావు సోమవారం హైదరాబాద్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రంగారావును మంత్రి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ శ్రీనివాసాచారి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కేవీ.సీతారామశాస్త్రి తదితరులు ఉన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): మేళ్లచెరువు మండల కేంద్రంలో మైహోమ్ సిమెంట్స్ ఇండస్ట్రీస్ ప్రతిపాదించిన మూడు ప్రాజెక్టులకు సంబంధించి ఈనెల 31న రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చేపట్టనున్న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను నిలిపి వేయాలని స్థానిక న్యాయవాది కమతం నాగార్జున కోరారు. ఈ మేరకు సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే రోజు 2 గంటల వ్యవధితో చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, వీటిని రీ షెడ్యూల్ చేయాలని విన్నవించారు.

డీఎస్‌పీ సభకు తరలిరండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): నల్లగొండలో ఈనెల 16న జరిగే ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) ఆవిర్భావ సభకు కార్యకర్తలు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం సూర్యాపేటలోని రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద సభకు సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, బాలు, విజయరామరాజు, కృష్ణ నాయక్, రమేష్, సైదులు, నాగరాజు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభతోనే గుర్తింపు

భానుపురి (సూర్యాపేట): ముదిరాజ్ మహాసభతోనే ముదిరాజ్ కులస్తులకు గుర్తింపు లభించిందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలో జరిగిన ముదిరాజ్ మహాసభ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19న హైదరాబాద్‌లో అన్ని రాజకీయ పార్టీలకు అల్టిమేట్ ఇచ్చేందుకు ముదిరాజ్ ప్లీనరీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా పిట్టల శంకర్, రాష్ట్ర మహిళా కార్యదర్శిగా ఇంటి అచ్చమ్మ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామకృష్ణను నియమిస్తూ నియమక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఈదుల యాదగిరి, మహిళ అధ్యక్షురాలు దండు రేణుక, ఆకుల లవకుశ, సారగండ్ల కోటయ్య, కోలా నిరంజన్, పావని, వెంకటమ్మ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకట్రావు



జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాజేంద్ర ప్రసాద్, ఇతర అధికారులు

సూర్యాపేట: భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం జరగబోయే 77వ స్వాతంత్ర్య దినత్సోవ ఏర్పాట్లను ఎస్పీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన సోమవారం పరిశీలించి మాట్లాడారు. వివిధ శాఖల ప్రగతిపై రూపొందించబోయే ఎగ్జిబిషన్స్, శకటాల ప్రదర్శనపై తగు సూచనలు చేశారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీరబ్రహ్మచారి, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, డీఎస్పీ నాగభూషణం, డీటీడీఓ శంకర్, డీఏఓ రామారావు నాయక్, హార్టికల్చర్ అధికారి శ్రీధర్, సివిల్ సప్లయ్ డీఎం రాంపతి, కమిషనర్ రామానుజులరెడ్డి, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణికి జిల్లా అధికారులే హాజరు కావాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో అదనపు కలెక్టర్లు, ఎస్పీ, డీఆర్‌డీఓ

కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులే హాజరు కావాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు సీహెచ్ ప్రియాంక, ఏ.వెంకటరెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేసేవిధంగా అధికారులు ఉండకూడదని, ప్రతి ఫిర్యాదు వారంలోగా పరిష్కారం కావాలని, ప్రతి వారం ప్రజావాణిపై మానిటరింగ్ ఉంటుందన్నారు. ప్రజావాణికి కింది స్థాయి ఉద్యోగులను పంపొద్దని, సమాచారం లేకుండా జిల్లా అధికారులు గైర్హాజరు అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 20న ముఖ్యమంత్రి పర్యటన ఉన్నందున అధికారులు, సిబ్బంది తప్పకుండా ఐడీకార్డులు వినియోగించాలని సూచించారు. గృహలక్ష్మి దరఖాస్తులను 20 నాటికి పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమలో జెడ్పీ సీఈఓ సురేష్, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డీఎఫ్ఓ సతీష్ కుమార్, పీఆర్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు చేయండి



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు, ఇతర అధికారులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఈ నెల 20న సూర్యాపేట పట్టణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన కలెక్టరేట్, పోలీస్ కార్యాలయం, మెడికల్ కళాశాల భవనం, అలాగే కొత్త మార్కెట్ యార్డ్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను ఎస్పీ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ప్రారంభించనున్న భవనాల పనులను ఈ నెల 17 నాటికి పూర్తిచేయడంతోపాటు ముందస్తుగా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీస్, జిల్లా అధికారులను ఆదేశించారు. పట్టణంలో పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అంతకు ముందు 60 ఫీట్ల రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, ఏ.వెంకట్‌రెడ్డి, ఏఎస్పీ ఎం.నాగేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ యాకుబ్, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీపీయూఎస్ ధర్నాను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీపీయూఎస్ నాయకులు

చివ్వెంల: ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 19న హైదరాబాద్‌లోని ఇందిర పార్కు వద్ద తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యామా రమేష్ కోరారు. సోమవారం చివ్వెంలలో ధర్నా పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో కళారాణి, కవిత, సరోత్తమ్ రెడ్డి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

జయహో జనగణమన..



ఎన్జీ కళాశాల వద్ద జాతీయ గీతాలాపన చేస్తున్న స్థానికులు

యువతలో దేశభక్తి పెంపొందించాలనే నిశ్చయంతో జనగణమన ఉత్సవ సమితి 2021 జనవరి 23న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి రోజున నల్లగొండ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నిత్య జాతీయ గీతాలపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నాటి నుంచి నిర్విరామంగా జాతీయ గీతాలాపన కార్యక్రమం కొనసాగుతోంది. దీని కోసం పట్టణంలోని ప్రధాన రహదారిలో మైక్‌లను ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 8.30 గంటలకు ప్రధాన కూడళ్లలో జాతీయ గీతాలపన ప్రారంభమవుతుంది. గీతాలాపన సమయంలో రోడ్లపై వెళ్తున్న పాదాచారులు, వాహనదారులు స్వీయ క్రమశిక్షణతో జాతీయ గీతం ఆలపిస్తారు.

ఇతర ప్రాంతాలకు విస్తరణ..

మొదటగా నల్లగొండ పట్టణంలో నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో ఇతర ప్రాంతాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించారు. 2022 జనవరి 27న తిప్పర్తిలో, 2022 ఆగస్టు 15న నార్కట్‌పల్లి మండల కేంద్రంలో, ఆ తర్వాత పానగల్లు పట్టణంలో ప్రారంభించారు. త్వరలో త్రిపురారం, చండూరు, హాలియాలో ప్రారంభించనున్నారు.

దేశభక్తిని అలవర్చుకోవాలి



విజయ్‌కుమార్



రవికుమార్

ఎంతో మంది తమ ప్రాణాలు త్యాగం చేయడం వల్లే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. వారి త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ముఖ్యంగా చిన్నారులు, యువత దేశభక్తిని అలవర్చుకోవాలి. దేశం నాది అనే భావం అందరిలో కలగాలి. నిత్య జాతీయ గీతాలపన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇదే స్ఫూర్తితో ఇతర మండలాల్లో కూడా విస్తరించేందుకు జనగణమన ఉత్సవ సమితి ప్రయత్నిస్తోంది.

- కర్నాటి విజయ్‌కుమార్, జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు
- కొలనుపాక రవికుమార్, ప్రధాన కార్యదర్శి

దేశ సేవలో సంతృప్తి

ఎముకలు కొరికే చలితో సహజీవనం.. జారిపడే మంచు దిబ్బలతో నిత్యం పొంచి ఉండే ప్రమాదం. వీటికి మించి దాడి చేసేందుకు సిద్ధంగా ఉండే శత్రుసైన్యం మరోపక్క. సంవత్సరాల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండడంతో ఎదురయ్యే మానసిక, శారీరక సమస్యలను అధిగమిస్తూ మాతృదేశ సేవలో తరిస్తున్నారు మన సైనికులు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పలువురు మాజీ సైనికులు వెల్లడించిన అనుభవనాలు ఇవీ..

- నల్లగొండ డెస్క్



- సియాచిన్‌లో డ్యూటీ సవాలే..
- ఆపరేషన్ మేఘ్‌దూత్‌లో పాల్గొన్న
- ఆ సమయంలో నా కాలు కోల్పోయా
- మాజీ సైనికుడు రేపాక శ్రీధర్‌రెడ్డి

'దేశ సేవలోనే ఎంతో సంతృప్తి ఉంది. ఎముకలు కొరికే చలిలో పనిచేయడం సవాల్‌తో కూడుకున్న విషయం' అని చెప్పారు నల్లగొండలోని పానగల్లుకు చెందిన మాజీ సైనికుడు రేపాక శ్రీధర్‌రెడ్డి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ సియాచిన్‌లో డ్యూటీ చేసినప్పటి అనుభవాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

1986లో ఆర్మీలో చేరాను. మొదట సీఆర్‌పీఎఫ్‌కు ఎంపికైతే కుటుంబ సభ్యులు వద్దన్నారు. సైన్యంలో ఎంపికకు మాత్రం ఇంట్లో వాళ్లకు చెప్పకుండా వెళ్లాను. సైన్యంలోకి ఎంపిక నల్లగొండలో జరిగింది. అప్పుడు 15 మంది మాత్రమే వచ్చారు. సైన్యంలో శిక్షణ పూర్తయిన తర్వాత మద్రాస్ రెజిమెంట్‌లో చేరాను. మొదటిసారే సియాచిన్ పర్వతాల్లో డ్యూటీ పడింది. అక్కడ అత్యంత చలి ఉంటుంది. వాతావరణం మైనస్ 40 డిగ్రీలుంటుంది. ఆ వాతావరణానికి అలవాటు పడడానికి లే-లడహక్‌లో ఏడాదిన్నర ఉంచారు. ఆ ప్రాంతంలో భారత్, పాకిస్తాన్ సైనికుల మధ్య నిరంతరం కాల్పులు జరుగుతుండేవి. సియాచిన్‌లో 1984లో ప్రారంభమైన ఆపరేషన్ మేఘ్‌దూత్.. వాజ్‌పేయి ప్రధాన మంత్రి అయిన సమయం వరకు కొనసాగింది. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందంతో కాల్పులు ముగిశాయి. ఈ ఆపరేషన్‌లో మొత్తంగా 11 మంది జవాన్లు వీరమరణం పొందారు. నేను 1989లో ఆపరేషన్ మేఘ్‌దూత్‌లో పాల్గొన్నాను. మా ముందు వెళ్లిన ఫోర్స్‌ను పికప్ చేసుకోవడానికి మేము వెళ్లాము. మా ఫోర్స్‌లో 30 మంది జవాన్లు ఉన్నారు. అకస్మాత్తుగా మంచు చరియలు విరిగిపడడంతో మా బృందంలో నలుగురు మరణించగా నేను తీవ్రంగా గాయపడ్డాను. సరిహద్దు ప్రాంతం నుంచి బేస్‌క్యాంపు వరకు సహచర జవాన్లు తీసుకువచ్చారు. మమ్మల్ని తీసుకెళ్లడానికి సైన్యానికి చెందిన చిన్న విమానాలు బేస్ క్యాంపు వరకే వస్తాయి. అక్కడి నుంచి చండీగఢ్‌లోని మిలటరీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పది రోజుల సమయం పట్టింది. గాయం పెద్దది కావడంతో కాలు కింది భాగం తీసేశారు. ఆరు నెలలు చికిత్స పొంది కోలుకున్న తర్వాత మిలటరీ కార్యాలయాల్లో క్లర్క్‌గా ఉద్యోగం ఇచ్చారు. సైనిక విధులు కాకుండా.. క్లరికల్ పోస్టులో పనిచేసి 2003 సంవత్సరంలో రిటైర్డ్ అయ్యాను. ఆ తర్వాత 2009లో కోర్టు ఉద్యోగానికి ఎంపికయ్యాను. ప్రస్తుతం నల్లగొండ జిల్లా కోర్టులో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నా. నాకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇప్పుడు సియాచిన్‌లో డ్యూటీ చేసే సైనికులకు సౌకర్యాలు పెరిగాయి. అలవెన్స్‌లు కూడా ప్రభుత్వం పెంచింది. అప్పుడు సైన్యంలో మరణిస్తే అక్కడే అంత్యక్రియలు చేసేవారు. జవాన్‌కు సంబంధించిన దుస్తులు, కిట్ మాత్రమే ఇంటికి పంపేవారు. కార్గిల్ యుద్ధం తర్వాత సైనికుల మృతదేహాలను వారి స్వగ్రామాలకు పంపుతున్నారు.



తన అనుభవాలను వివరిస్తున్న శ్రీధర్‌రెడ్డి



నల్లగొండలో జాతీయ జెండాతో యోగా ట్రైనర్ సంధ్య

కళ్లముందు దేశమే కనిపించింది..

- మాజీ సైనికుడు దోమకొండ సుధాకర్



మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడకు చెందిన నేను డిగ్రీ చివరి సంవత్సరంలో 1991లో ఆర్మీలో చేరాను. వివిధ హోదాల్లో పనిచేసి 2008 జూలై 31న రిటైర్ అయ్యాను. నేను 1999 మే 3న 8,500 ఫీట్ల ఎత్తులో ఉన్న కార్గిల్ కొండను ఆక్రమించిన పాకిస్తాన్ సైనికులతో జరిగిన యుద్ధంలో పాల్గొన్నా. కార్గిల్ ఎడ్జ్ ఏరియాలో ఉన్న మేము పాకిస్తాన్ సైనికులు కార్గిల్ కొండను ఆక్రమించారని తెలుసుకుని బృందాలుగా విడిపోయాం. ఒక్కో బృందంలో 400 మందికి పైగా ఉన్నారు. 320 ఫీల్డ్ రెజిమెంట్‌లో ఒక సభ్యుడిగా నేను 130ఎంఎం గన్స్‌తో యుద్ధ రంగంలోకి దిగాను. నా కళ్ల ముందే మా బృందం కెప్టెన్ సత్నంసింగ్‌తో పాటు ఇద్దరు జూనియర్ కమిషనర్ ఆఫీసర్లు, నలుగురు జవాన్లు నేల కొరిగారు. పది మందికి పైగా కాళ్లు, చేతులు తెగిపోయి విగత జీవులుగా మిగిలారు. 1999 మే 3వ తేదీన ప్రారంభమైన కార్గిల్ యుద్ధం జూలై 24న ముగిసింది. జూలై 26న కార్గిల్ యుద్ధ విజయోత్సవాలు జరుపుకున్నాం. ఆ యుద్ధంలో పాల్గొన్న నన్ను ప్రభుత్వం 'ఓపీ విజయ్' మెడల్‌తో సత్కరించింది.

రిటైర్మెంట్ తర్వాత చిన్నచూపు

దేశ సరిహద్దులో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన మమ్ములను రిటైర్డ్ అయ్యాక ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. వన్‌ర్యాంక్.. వన్ పెన్షన్ విధానం కావాలని అనేక ఏళ్లుగా పోరాడుతున్నాం. దేశానికి సేవ చేశామనే సంతృప్తి ఉన్నా.. మా త్యాగాలను గుర్తించి మాకు రావలసినవి పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడం కొంత నిరాశగా ఉంది.

దేశం మీద ప్రేమతోనే సైన్యంలోకి..

- మాజీ సైనికుడు కృష్ణ



చిలుకూరు మండలం బేతవోలుకు చెందిన నేను దేశం మీద ప్రేమతో 2003 జూలైలో ఆర్మీలో చేరాను. బెంగళూరులో శిక్షణ పూర్తయ్యాక చండీఘర్, మణిపూర్, జమ్ముకశ్మీర్, రాజస్థాన్, అరుణాచల్‌ప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్‌లో పనిచేశా. రాజస్థాన్‌లో పదవీ విరమణ పొందాను. 2008లో జమ్ముకశ్మీర్‌లోని బాలాపూర్‌లో పని చేస్తున్నప్పుడు జరిగిన ఆపరేషన్‌లో ధైర్యంగా పాల్గొన్నా. అరుణాచల్‌ప్రదేశ్‌లోని టవాంగ్‌లో మేము ఉన్న ప్రదేశం సముద్రమట్టం నుంచి 1400 అడుగుల ఎత్తులో ఉండేది అక్కడ శ్వాస కూడా సరిగా అడేది కాదు ఆ సమయంలో దేశ రక్షణే ధ్యేయంగా పని చేశాను.

నాన్న మృతి చెందిన వారం తర్వాత వచ్చా..

శ్రీనగర్‌లో పని చేస్తున్నప్పుడు 2009 ఆగస్టు 14వ తేదీన అనారోగ్యంతో మా నాన్న మృతి చెందారు. మాకు ఆగస్టు 13,14,15, జనవరి 24,25,26 తేదీల్లో సెలవులు ఇవ్వరు. మా నాన్న చనిపోయారని చెబితే ఆగస్టు 18న సెలవు ఇచ్చారు. ఇంటికి వచ్చే సరికి 21వ తేదీ అయ్యింది. నేను వచ్చాకే దహన సంస్కారాలు చేశారు. ఆ సమయం నేను చాలా బాధపడ్డా. నా 20 ఏళ్ల సర్వీసులో నేను పని చేసిన ప్రతిచోటా సహచరులమంతా కలిసిమెలసి ఉండేవాళ్లం.

రెండో ఏఎన్‌ఎంల నిరసన, సమ్మె నోటీస్ అందజేత

చివ్వెంల: సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఎఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కుడకుడలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సెకండ్ ఏఎన్‌ఎంలతో కలిసి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హర్షవర్ధన్‌కు సమ్మె నోటీస్ అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో చామల అశోక్, రాజారాం, నిమ్మల ప్రభాకర్, ఎం.లక్ష్మి, స్వప్న, అన్నపూర్ణ, ధనమ్మ, అరుణ, సంధ్య పాల్గొన్నారు.

అర్వపల్లి : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పీహెచ్‌సీలో రెండో ఏఎన్‌ఎంలు నిరసన తెలిపి బుధవారం నుంచి చేపట్టే నిరవధిక సమ్మె నోటీస్‌ను సీహెచ్‌ఓ చరణ్‌కు అందజేశారు. కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలు విజయశాంతి, నాగరాణి, శకుంతల, ఊర్మిళ, గిరిజ, శ్వేత పాల్గొన్నారు.

తిరుమలగిరి : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సెకండ్ ఏఎన్‌ఎంలు ఈ నెల 16 నుంచి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం తిరుమలగిరి తహసీల్దార్ రమణారెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో శ్రీలత, రమ, వెంకటమ్మ, రజిత, యశోద, మాధవి పాల్గొన్నారు.

మఠంపల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న రెండో ఏఎన్‌ఎంల సర్వీస్‌లను రెగ్యులరైజ్ చేయాలని వారు కోరారు. ఈమేరకు సోమవారం మఠంపల్లి మండల పరిషత్‌లో ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రెండో ఏఎన్‌ఎంలు సరిత, సైదమ్మ, భూదేవి, రజిని, రాణి, ఎం.సైదమ్మ, సుజాత, తదితరులు ఉన్నారు.

చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మునగాల : దేశ జనాభాలో యాభై శాతానికి పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో యాభైశాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్ కోరారు. సోమవారం కలకోవలో నిర్వహించిన ఆ సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీసీ జనగణన జరపాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి వంశీయాదవ్, శ్రీరామ్ హేమంత్, శేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక


పెన్‌పహాడ్: బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి


నాగారం : ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండలంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. అనాజిపురం ఎంపీటీసీ గద్దల నాగరాజు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనతో పాటు అదే గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు దొంగరి విజయ్‌కుమార్, వల్లంపట్ల విజయ్‌కుమార్, శంకర్, కొండేటి నాగరాజు, లెంకలపల్లి సత్యనారాయణ, అనుములపురి కృష్ణప్రసాద్, సిద్ధు, అశోక్, హేమంత్, రాయి చంటి, మీసాల గోపి, బచ్చలకూరి ప్రభాకర్‌తో పాటు మరికొంత మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి జగదీష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ డైరెక్టర్ ఒంటెద్దు నర్సింహారెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, సర్పంచ్ చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, మామిడి అంజయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఈటూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త పేరాల ఉపేందర్‌తో పాటు మరికొంత మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ఎర్ర యాదగిరి, ఎంపీటీసీ వడ్డే పరశురాములు, చిల్లర చంద్రమౌళి, పేరాల యాదగిరి, గంట నర్సింహారెడ్డి, యల వెంకన్న పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే విరాళం

తుంగతుర్తి : మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో గౌడ సంఘం నాయకులకు రూ.1.75లక్షలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గుండగాని రాములుగౌడ్, పులుసు యాదగిరి, పులుసు వెంటనారాయణ, సాయిలు, యాదగిరి, దుర్గయ్య, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతారంలో అదనపు కలెక్టర్ పర్యటన

పెన్‌పహాడ్ : మండలంలోని అనంతారంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక పర్యటించారు. ఈ సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీపీఓ యాదయ్య, డీఎఫ్‌ఓ సతీష్, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఏపీఓ రవి, ఏపీఎం అజయ్, ఎంపీఓ నరేష్, ఎస్‌ఐ వెంకన్న గౌడ్, కార్యదర్శి రాజేష్ ఉన్నారు.


పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తుంగతుర్తిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 2002–2003 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమ చిన్ననాటి జ్ఞాపకాలను, స్మరించుకొని, ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యా బోధన చేసిన గురువులను శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే పూర్వ విద్యార్థుల సమక్షంలో సృజన సేవా సమితి అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం యాకయ్య, ఉపాధ్యాయులు మల్లయ్య, సంతోష్, మాధవ్, భాస్కర్, రాములు, సుదర్శన్, కృపాకర్‌రెడ్డి, సోమయ్య, భవాని, మల్లారెడ్డి, స్వామి, ఫజల్‌పాష, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సాగు నీరు విడుదల చేయాలి


ఆర్డీఓ జగదీష్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి ఆయకట్టు పరిధిలో ఎండుతున్న పంటలను కాపాడాలని వ్యవసాయ కార్మిక, రైతు సంఘం రాష్ట్ర నాయకులు పల్లె వెంకటరెడ్డి, నాగారపు పాండు కోరారు. సాగర్ నీటిని విడుదల చేయాలని కోరుతూ సోమవారం హుజూర్‌నగర్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓ జగదీష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 1.25 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉందని, అందులో ఇప్పటికే అరవై శాతం భూముల్లో బోర్లు, బావుల కింద వరి పంట సాగు చేశారని చెప్పారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో బోర్లు, బావుల్లో నీరు రెండు, మూడు గంటలకే అడుగంటి పోతున్నాయని కావున పంటలను కాపాడుకునేందుకు సాగర్ నీటిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు శీలం శ్రీను, పి.హుస్సేన్, ఆర్.మురళి, టి.యోనా, వీరబాబు, పి.వెంకటరెడ్డి, ఆర్.వెంకన్న, పి.వెంకటనారాయణ, వీరమల్లు, వీరస్వామి, వెంకన్న, నరసింహచారి, రాములు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

పాలు కల్తీ చేస్తే కఠిన చర్యలు

సూర్యాపేట : పాలు, పాల ఉత్పత్తులు కల్తీ చేయడం నేరమని, ఎవరైనా కల్తీకి పాల్పడినట్లు రుజువైతే కఠిన చర్యలు తప్పవని ఆహార భద్రత, ప్రత్యేక తనిఖీ అధికారి కళ్యాణ్ చక్రవర్తి హెచ్చరించారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని పలు పాల కేంద్రాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. అనంతరం పాల శాంపిళ్లు సేకరించి పరీక్షల కోసం హైదరాబాద్‌కు పంపించారు. పాల కల్తీ గురించి ఎవరికి తెలిసిన వెంటనే 9885407703 నంబర్ కు కాల్ చేసి సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఆయన వెంట ఆహార భద్రత అధికారి కృష్ణమూర్తి , లతీఫ్ పాల్గొన్నారు.


పాల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి

ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ జన్మదిన వేడుకలు

కోదాడ : నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. వివిధ వర్గాల ప్రజలు, నాయకులు, అధికారులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కోదాడరూరల్ : మండలంలోని కూచిపూడిలో ఎంపీటీసీ శంకరశెట్టి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కూచిపూడి తండా సర్పంచ్ భుక్య సైదా, పీఏసీఎస్ డైరెక్టర్ శెట్టి శ్రీనివాసరావు, అబ్దుల్‌నబీ, బాబురావు, భాషా, తిరపతయ్య, నాంచరయ్య, బుచ్చయ్య, కోటేశ్వరరావు, సాంబశివచారి తదితరులు ఉన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ జన్మదిన వేడుకలను సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొండా సైదయ్య, నలబోలు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


కోదాడ : పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

సంక్షిప్త సమాచారం

ప్రైవేట్ పాఠశాలల బస్సులను అడ్డుకొని నిరసన

అర్వపల్లి : మండల పరిధిలోని కుంచమర్తి ప్రాథమికోన్నత పాఠశాలకు రోజురోజుకూ విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. గ్రామంలోని విద్యార్థులు ఎక్కువ మంది స్థానిక పాఠశాలకు వెళ్లకుండా యండ్లపల్లి, అర్వపల్లి, ఫణిగిరి గ్రామాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. ఉదయాన్నే ప్రైవేట్ పాఠశాలల బస్సులు గ్రామానికి వచ్చి బస్సుల్లో విద్యార్థులను తీసుకెళ్తున్నాయి. దీంతో గ్రామస్తులు కొందరు సోమవారం కుంచమర్తి గ్రామ శివారులో రోడ్డుపై పాఠశాలల బస్సులను అడ్డుకొని తమ గ్రామానికి రావద్దని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంచమర్తి గ్రామస్తులు ఉగ్గం లింగరాజు, పంది సైదులు, ఎస్‌కె. జానిపాష, ఎర్ర వెంకటేష్, లచ్చయ్య, రవి, శ్రీరాములు, నరేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా జంగా వెంకటేశ్వర్లు

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ ముదిరాజ్ మహాసభ సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా నెమ్మికల్ గ్రామానికి చెందిన జంగా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సూర్యాపేట పట్టణంలో జరిగిన ముదిరాజ్ మహాసభ జిల్లా కమిటీ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాస్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఈదుల యాదగిరి ముదిరాజ్ సమక్షంలో నియామకపత్రం అందుకున్నారు.

న్యాయవాదులకు క్రికెట్ పోటీలు

హుజూర్‌నగర్ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హుజూర్‌నగర్‌లో న్యాయవాదులకు సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ ప్రారంభించారు. పోటీలలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, నిర్వాహకులు తదతరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి తహసీల్దార్‌గా కవిత బాధ్యతల స్వీకరణ

గరిడేపల్లి : మండల తహసీల్దార్‌గా బండ కవిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన జి.కార్తీక్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి రావడంతో భద్రాది కొత్తగూడెం శ్రీసీతారామ ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ స్పెషల్ కలెక్టర్‌గా వెళ్లారు. కేతేపల్లిలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న బండ కవిత పదోన్నతిపై గరిడేపల్లికి వచ్చారు.

చింతలపాలెం తహసీల్దార్‌గా సురేందర్‌రెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల నూతన తహసీల్దార్‌గా తుమ్మల సురేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతి పొంది చింతలపాలెం తహసీల్దార్‌గా వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ వాజిద్‌అలీ తహసీల్దార్‌గా పదొన్నతి పొంది నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

తుంగతుర్తి : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని కాంగ్రెస్‌పార్టీ ప్రచార కమిటీ సభ్యుడు డాక్టర్ వడ్డెపల్లి రవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించి ర్యాలీ తీశారు. ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీ హామీలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుజ్జ నరేందర్, బాబు, సుధాకర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీనే ముఖ్యమంత్రిగా ప్రకటించాలి

నూతనకల్ : రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిగా ప్రకటించాలని బీసీ విద్యార్థి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బసుల అశోక్ యాదవ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీసీలకు మద్దతు పలికే పార్టీనే ఎన్నికల్లో ఆదరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం యువజన నాయకులు బంటు బద్రిగౌడ్, పాండుల లింగన్న, నెల్లుట్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

నాగారం : రైతులు సాగు చేసిన పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఏడీఏ జగ్గునాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. అలాగే పంటల నమోదు ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. ఆయనతో పాటు ఏఈఓ సాయిరాజ్, రైతులు తదితరులు ఉన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

నూతనకల్ : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో ఈ నెల 19న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షులు పర్వతం సంధ్యారాణి కోరారు. సోమవారం తాళ్లసింగారం జెడ్పీహెచ్‌ఎస్‌లో మహాధర్నా పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల దేవదాసు, బండి మధుసూదన్‌రెడ్డి, భిక్షం, అశోక్, వెంకటేశ్, హన్మంతు, వెంకటయ్య పాల్గొన్నారు.

కొండాయిగూడెం గ్రామస్తుల హర్షం

హుజూర్‌నగర్ : గరిడేపల్లి మండలంలోని కొండాయిగూడెంను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆ గ్రామస్తులు సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని కలిసి శాలువాతో సన్మానించారు. గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

కోదాడ : ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సోమవారం కోదాడలో బీజేపీ ఆధ్వర్యంలో విభజన, విధ్వంసక గాయాల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులు, నాయకులు కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కనగాల నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, నూనె సులోచన, వంగవేటి శ్రీను, ఓరుగంటి కిట్టు, జగిని ప్రసాద్, దేవరశెట్టి సత్యనారాయణ, అశోక్, శ్రీనివాస్, పిచ్చయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి


బహుమతులు అందజేస్తున్న గుంటకండ్ల సునీత

సూర్యాపేట : క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సతీమణి గుంటకండ్ల సునీత అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని 28వ వార్డులో కోలాటం ఆడే మహిళలకు ఏర్పాటు చేసిన చీరల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సూర్యాపేట పీఏసీఎస్ డైరెక్టర్ రాపర్తి భవాని, కౌన్సిలర్ రాపర్తి శ్రీనివాస్‌గౌడ్‌లు ఆమెకు స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఇండ్ల సురేష్, పొన్నం సైదులు, రాపర్తి లచ్చయ్య, రాపర్తి సైదులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

మునగాల : కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో అధికారంలోకి తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నాయకుడు పందిరి నాగిరెడ్డి కోరారు. మన ఊరు– మన కాంగ్రెస్‌లో భాగంగా సోమవారం ఆయన మండలంలోని ఈదులవాగుతండా, మద్రికుంటతండా, నేలమర్రి, వెంకట్రాంపురం గ్రామాలలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మద్రికుంట తండాలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్త హనుమను పరామర్శించి రూ.ఐదువేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్ విద్యాసంస్థల సీఈఓ ఎస్‌ఎస్‌రావు, జలందర్, హరి, సాయి పాల్గొన్నారు.


కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి


ధర్నా నిర్వహిస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

నూతనకల్ : మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు మొగుళ్ల గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం చిల్పకుంట్లలోని మిషన్ భగీరథ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. కార్మికులకు పీఎఫ్, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కూసు ఉప్పలయ్య, గంటా రామకృష్ణ, సైదులు, సామ శ్యామ్, బత్తుల హరిక్రిష్ణ, గుర్వయ్య, సంపత్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలపై దాడులు దురదృష్టకరం

దురాజ్‌పల్లి (సూర్యాపేట), హుజూర్‌నగర్ : మణిపూర్ రాష్ట్రంలో మూడు నెలలుగా క్రైస్తవ మైనారిటీలపై జరుగుతున్న దాడులు దురదృష్టకరమని, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, మహిళా సమాఖ్య నాయకురాళ్లు ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న దాడులను ఖండిస్తూ సోమవారం సూర్యాపేటలో కలెక్టరేట్ ఎదుట క్రైస్తవ సంఘాలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విన్నవించాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంకకు వినతి పత్రం అందించారు. అలాగే, హుజూర్‌నగర్‌లో మహిళా సమాఖ్య నాయకురాళ్లు కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా చైర్మన్ మామిడి శాంసన్, గౌరవ అధ్యక్షుడు ఎం.ప్రభుదాసు, డి.పౌలు, మరియన్న, రమేష్ బాబు, డేవిడ్ రాజు, సమాఖ్య నాయకురాళ్లు సుజాత, లక్ష్మమ్మ, మమత, రేష్మా, ప్రమీల, వీణ, రామనర్సమ్మ, రాములమ్మ, రాధా, దుర్గ, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న మహిళా సమాఖ్య నాయకులు

కాంగ్రెస్ నాయకుల నిరసన

తిరుమలగిరి : వెలిశాల గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శిలా ఫలకం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్సోజు నరేష్, ఎండీ.హాఫీజ్, పేరాల వీరేష్, జమ్మిలాల్, మల్లయ్య, ప్రేమ్‌ప్రసాద్, లక్ష్మి, అశోక్, శ్రీను, మల్లేష్, సోమనర్సయ్య, రాఖేష్, మహేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

చీదెళ్లలో విషాదం

పెన్‌పహాడ్ : పండుగకు వెళ్లి తిరిగి వస్తున్న తాత మనవళ్లు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పెన్‌పహాడ్ మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన దేశగాని సైదులు, మనమడు అరవింద్‌లు సూర్యాపేట పట్టణంలో ఆదివారం తన కూతురు నిర్వహించిన బోనాల పండుగకు హాజరై బైక్‌పై తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో మునగాల మండలం మాధవరం గ్రామ శివారులో కారు ఢీకొట్టిన విషయం తెలిసిందే. ప్రమాదంలో తాత సైదులు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలైన అరవింద్‌ను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఒకే కుటుంబానికి చెందిన తాతా,మనుమడు మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సోమవారం నిర్వహించన అంత్యక్రియల్లో గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీరుమున్నీరయ్యారు.

చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : చింతలపాలెం మండలం చింత్రియాలకు చెందిన పేరుపంగు కిరణ్ బాబు ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందారు. దీంతో బాధిత కుంటుంబానికి విద్యుత్ శాఖ నుంచి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరైంది. సోమవారం ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి చెక్కును కిరణ్ భార్య సుభాషిణికి అందజేశారు.

వైభవంగా బోనాలు


బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

మోతె : మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో సోమవారం బోనాల (ముత్యాలమ్మ) పండుగను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు డప్పుచప్పుళ్లతో ప్రదర్శనగా వెళ్లి గ్రామ దేవతలకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఉండ్రుగొండ ఆలయంలో మహారుద్రాభిషేకం

చివ్వెంల(సూర్యాపేట) : అధిక శ్రావణ మాస శివరాత్రి సందర్భంగా చివ్వెంల మండలం ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలోని శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మహారుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు మనోహర శర్మ, గురునాథ శాస్త్రి, ఫణికుమార శర్మ, శరత్ శర్మలు వేద మంత్రోచ్చరణలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో అధిక వర్షాలు కురిసి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చకిలం కృష్ణ కుమార్, బందకవి కృష్ణ మోహన్, మధు సూదనాచారి, తదితరులు పాల్గొన్నారు.